నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
10 | ఖమ్మం, శుక్రవారం 21 ఫిబ్రవరి 2025 | BHADRADRI KOTHAGUDEM

- కూలీలతో కలిసి 'ఉపాధి' పనులు చేసిన కలెక్టర్
- భూగర్భ జలాల పెంపునకు పారం పాండ్‌లు నిర్మించాలని సూచన

పలుగు, పార పట్టిన 'పాటిల్'

ఉపాధిహామీ పనుల తనిఖీకి వచ్చిన కలెక్టర్ జితేశ్ వి పాటిల్.. కూలీలతో మమేకమై పలుగు, పార పట్టి మట్టి తవ్వారు. తట్టలో మట్టిపోసి కూలీలకు అందించి వారిని ఉత్సాహపరిచారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గురువారం సులానగర్, చింతలంక, కోయగూడెం, చంద్రుతండా, కొత్తతండా గ్రామపంచాయితీల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులను పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలాలను పెంపొందించేందుకు రైతులు తమ వ్యవసాయ భూముల్లో పారం పాండ్‌లు నిర్మించుకోవాలని సూచించారు. ఈ క్రమంలో పలువురు రైతులు యాసంగి సాగుకు విద్యుత్ సమస్య, పోడు భూముల్లో విద్యుత్ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వెంటనే సంబంధిత అధికారులకు ఆయా అంశాలపై తగిన సూచనలు చేశారు. రైతులు మిర్చి, పత్తి వాణిజ్య పంటలే కాకుండా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే మునగ, వెదురు, పామాయిల్ సాగుపై అవగాహన కల్పించారు. అనంతరం పలు గ్రామాల్లో మునగ, పామాయిల్ క్షేత్రాలను పరిశీలించారు. డీఎల్‌పీవో రమణ, మిషన్ భగీరథ డీఈ పద్మావతి, విద్యుత్ శాఖ డీఈ రంగస్వామి, ఎంపీడీవో రబీందర్‌రావు, ఎంపీవో గణేశ్ గాంధీ, విద్యుత్ ఏఈ బుజ్జి కన్నయ్య, పంచాయితీల కార్యదర్శులు పవిత్ర, గోపాలకృష్ణ, సిద్దం చిట్టి, ఉపాధి ఈసీ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు. **–ఇల్లెందు, ఫిబ్రవరి 20**

ఆయిల్‌ఫెడ్ అధికారుల అనాలోచిత నిర్ణయం సంస్థకు పెద్ద నష్టాన్నే తెచ్చిపెట్టింది. మినరల్ వాటర్ బిజినెస్‌లోకి ప్రవేశించాలనుకుంటే మొత్తానికే మునిగే పరిస్థితి ఎదురైంది. రూ.2.44 కోట్లు ఖర్చు చేసినా చివరికి రూ.వేలల్లో కూడా అమ్మకాలు జరగలేదు. దీంతో వ్యాపారాన్ని మొత్తానికే మూసివేయాల్సిన దుస్థితి దాపురించింది. ఆఖరికి ఆయిల్‌ఫెడ్ సంస్థపైనా, అన్నదాతలపైనా ఆర్థిక భారం పడడం తప్ప పైసా ప్రయోజనం లేకపోయింది. ఇదీ.. దమ్మపేట పామాయిల్ ఫ్యాక్టరీలో మినరల్ వాటర్ బిజినెస్‌లో ప్రవేశం పేరిట చేసిన ప్రయత్నంలో ఆయిల్‌ఫెడ్ అధికారులకు ఎదురైన వైఫల్యం. –అశ్వారావుపేట, ఫిబ్రవరి 20

- ఆయిల్‌ఫెడ్ అనాలోచిత నిర్ణయంతో చతికిలపడిన వ్యాపారం
- దమ్మపేట పామాయిల్ ఫ్యాక్టరీలో మూతపడిన వాటర్ ప్లాంట్
- రూ.2.44 కోట్లు ఖర్చు చేసినా.. రూ.వేలల్లోనే అమ్మకాలు
- పైగా గడిచిన ఐదేళ్లలో మరో రూ.1.83 కోట్ల మేర నష్టం
- ఫలితంగా ఆయిల్‌ఫెడ్‌పైనా, రైతులపైనా పడుతున్న ఆర్థిక ప్రభావం

మినరల్ వాటర్ బిజినెస్ మొత్తానికే ముంచింది!

ఆయిల్‌పాం సాగు విస్తరణలో లక్ష్యాలను చేరుకోలేక సతమతమవుతున్న ఆయిల్‌ఫెడ్ సంస్థ ఎలాంటి అనుభవం, సంబంధం లేని వాటర్ బిజినెస్‌లోకి దిగి చేతులు కాల్చుకున్నది. వ్యాపార విస్తరణ, మార్కెటింగ్ సౌకర్యంలో ఏమాత్రం పరిజ్ఞానం లేకపోవడంతో రూ.2.44 కోట్ల మేర నిధులు నిరుపయోగంగా మారాయి. 2020–21 ఆర్థిక సంవత్సరంలో దమ్మపేట పామాయిల్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సంస్థ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రూ.2.44 కోట్ల వ్యయంతో వాటర్ ప్లాంట్ నిర్మించారు. ఆ పెట్టుబడికి తగిన విధంగా ప్రతి నెలా రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు టర్నోవర్ జరగాలి. కానీ, రూ.వేలల్లోకి వ్యాపారం పడిపోవడంతో అధికారులు చేతులెత్తేశారు. చివరి ప్రయత్నంగా ప్లాంటును లీజుకు ఇచ్చేందుకు నిర్ణయించి టెండర్లు కూడా పిలిచారు. స్పందన లేకపోగా.. కొందరు వ్యాపారులు ప్లాంట్‌ను చూసి వెనక్కి వెళ్లిపోయారు. 2024 ఏప్రిల్ వరకు ప్రైవేట్ వ్యాపారుల కోసం ఎదురుచూసిన ఉన్నతాధికారులు తుది నిర్ణయంగా ప్లాంట్‌ను మూసివేశారు. దీంతో ప్లాంట్ నిర్మాణానికి వెచ్చించిన రూ.2.44 కోట్ల సంస్థ నిధులు నిరుపయోగమయ్యాయి.

రైతుల పెదవి విరుపు

ఆయిల్‌ఫెడ్ అధికారుల అనాలోచిత నిర్ణయంతో తమపై ఆర్థిక భారం పడుతుందని పలువురు రైతులు మండిపడుతున్నారు. కనీసం మార్కెటింగ్ సౌకర్యం అంచనా వేసుకోకుండా ఆయిల్‌ఫెడ్ సంస్థకు సంబంధం లేని నీళ్ల వ్యాపారంలోకి ఎందుకు దిగాల్సి వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. ఈ మొత్తాన్ని ఇతర అవసరాలకు వినియోగించుకున్నా సంస్థకైనా, రైతులకైనా ప్రయోజనం ఉండేదని సూచిస్తున్నారు.

ఆయిల్‌ఫెడ్ సంస్థకు ఆర్థిక నష్టం..

ఆయిల్‌ఫెడ్ ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయంతో సంస్థ ఆర్థికంగా నష్టపోయింది. ఐదేళ్లలో పెట్టిన పెట్టుబడి రూ.2.44 కోట్లకు కనీసం రూ.2 వడ్డీ వేసుకున్నా నెలకు రూ.4.88 లక్షల వరకు నష్టపోయింది. ఐదేళ్లలో ఈ నష్టం అంచనా రూ.2.93 కోట్లు. ఒకవేళ బ్యాంక్ వడ్డీ సుమారు రూ.1.25 చొప్పున లెక్కించినా.. ఏడాదికి రూ.3 లక్షల సంస్థ నష్టపోయింది. ఐదేళ్లలో ఈ నష్టం రూ.1.83 కోట్ల వరకు ఉంటుంది. ప్రతిరోజూ 2,400 కేసుల నీటి వ్యాపారం జరిగితేనే నష్టం లేకుండా ప్లాంట్ నిర్వహణ కొనసాగుతుంది. బయట మార్కెట్‌లో లీటర్ వాటర్ బాటిల్ ధర రూ.20 ఉంది. సంస్థ డీలర్‌కు ఇచ్చే ధర సుమారు రూ.7.70 అయినా మార్కెట్ చేసుకోలేకపోయింది. ప్లాంట్ ప్రారంభంలో అతి విశ్వాసంతో వాటర్ బాటిళ్లను ఉత్పత్తి చేసిన సంస్థ తర్వాత 1,000 కేస్‌ల బాటిళ్లను సైతం విక్రయించలేకపోయింది. ఫలితంగా సంస్థ ఆర్థిక నష్టాన్ని భారీగా చవిచూడాల్సి వచ్చింది.

దమ్మపేట పామాయిల్ ఫ్యాక్టరీలో నిర్మించిన వాటర్ ప్లాంట్

బాటిల్ ప్యాకింగ్ యూనిట్

మార్కెటింగ్ లేక మూసివేశాం..

వాటర్ ప్లాంట్‌ను 2021లో నిర్మించాం. 2024 ఏప్రిల్ వరకు మార్కెటింగ్ కోసం ప్రయత్నించాం. సరైన మార్కెట్ లేకపోవడంతో లీజుకు ఇచ్చేందుకు టెండర్ కూడా పిలిచాం. వ్యాపారుల నుంచి స్పందన లేకపోవడంతో ప్లాంట్‌ను మూసివేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.
–కల్యాణ్, మేనేజర్, పామాయిల్ ఫ్యాక్టరీ, దమ్మపేట

నా ఇంటి స్థలాన్ని ఇప్పించండి సారూ..

- మధిర తహసీల్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లే..
- గత్యంతరం లేక నిరసన దీక్షకు దిగిన వృద్ధురాలు కరుణమ్మ

మధిర, ఫిబ్రవరి 20: ఆక్రమణకు గురైన తన ఇంటి స్థలాన్ని ఇప్పించండి సారూ.. అంటూ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించింది. లేదంటే చావడానికైనా అనుమతి ఇవ్వండి అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకుని మధిర తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా దెందుకూరు గ్రామానికి చెందిన బాధితురాలు కనకపుడి కరుణమ్మ మాట్లాడుతూ గ్రామంలోని తన ఇంటి స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని, దీని గురించి తహసీల్దార్ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కారం కాలేదని వాపోయింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకురాలు స్థల వివాదంపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని అధికారులను ఆదేశించడం వల్లే తన సమస్య పరిష్కారం కావడం లేదని ఆరోపించింది. సమస్యను అధికారులు పరిష్కరిస్తారనే ఆశతో ఇన్నిరోజులు ఎదురుచూశానని, ఇక పరిష్కారం కాకపోవడంతో దీక్ష చేపట్టినట్లు విలపిస్తూ చెప్పింది.

మధిర తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న వృద్ధురాలు కరుణమ్మ

ఆక్రమణదారుడికి నోటీసులు ఇచ్చాం..

కరుణమ్మ ఇంటి స్థలాన్ని ఆక్రమించిన వారికి నోటీసులు ఇచ్చాం. శనివారంలోపు ఆ స్థలానికి సంబంధించిన కాగితాలు తీసుకురావాలని ఆదేశించాం. వాటిని పరిశీలించిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటాం. దీనిపై ఆమె చేసిన ఆరోపణలు వాస్తవం కాదు. సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తాం.
–రాంబాబు, తహసీల్దార్, మధిర

ఏసీబీ వలలో వ్యవసాయాధికారి

రైతు వద్ద రూ.30 వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

అశ్వాపురం, ఫిబ్రవరి 20: పత్తి విక్రయించేందుకు కూపన్ ఇవ్వడానికి ఓ రైతు నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా మండల వ్యవసాయాధికారిని ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఈ ఘటన అశ్వాపురంలో గురువారం చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ కథనం ప్రకారం.. ఓ రైతు తన పత్తిని విక్రయించేందుకు కూపన్ ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి సాయి శంతన్‌కుమార్‌ను కోరాడు. దీంతో ఆయన కూపన్ ఇచ్చేందుకు రూ.30 వేలు డిమాండ్ చేశాడు. ఈ క్రమంలో ఆ రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించి పరిస్థితిని వివరించాడు. వారు పన్నిన పథకం ప్రకారం.. వ్యవసాయాధికారి రైతు నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వ్యవసాయాధికారి సాయి శంతన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపారు. ఎవరైనా లంచం అడిగితే టోల్‌ఫ్రీ నంబర్ 1064కు డయల్ చేయాలని సూచించారు. దాడుల్లో డీఎస్పీ వెంట ఇన్‌స్పెక్టర్లు శేఖర్, సట్ల రాజు ఉన్నారు.

ఏసీబీకి పట్టుబడిన అశ్వాపురం ఏవో

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

సంబంధిత శాఖల అధికారుల సమావేశంలో భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఫిబ్రవరి 20: మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. ఎస్పీ రోహిత్‌రాజుతో కలిసి ఐడీవోసీ సమావేశ మందిరంలో ఇంటర్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీస్, ప్రజా రవాణా, వైద్య ఆరోగ్యం, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగే విధంగా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునే విధంగా అవసరమైన రూట్లలో బస్సు సర్వీసులు నడిచేలా చర్యలు చేపట్టాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతోపాటు ఒక ఏఎన్ఎం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. విద్యుత్‌కు అంతరాయం లేకుండా ఆ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వరాచారి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాస్కర్‌నాయక్, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, టేకులపల్లి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సులోచనారాణి, కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ మున్సిపల్ కమిషన్లు శేషాంజన్ స్వామి, శ్రీకాంత్, సుజాత పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్, చిత్రంలో ఎస్పీ రోహిత్‌రాజు

నర్సరీ దగ్గరకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నా..

అంగన్‌వాడీ కేంద్రం కట్టిన దగ్గర నుంచి తాగునీరు లేదు. పంచాయతీ వాళ్లు నర్సరీ కోసం వేసిన మోటర్ వద్దకు వెళ్లి బిందెతో నీళ్లు తెచ్చుకుంటున్నాను. మా అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా లేదు. నేనే నీళ్లు తెచ్చుకోవాలి. భగీరథ పైపులైను వేశారు గానీ నీళ్లు రావడం లేదు. మోటరు నీళ్లు తాగలేక ఇక్కడి పిల్లలు వారి ఇళ్ల నుంచి బాటిళ్లు తెచ్చుకుంటున్నారు.
–వజ్జా భారతి, అంగన్‌వాడీ టీచర్, చాతకొండ

చేతిపంపు దగ్గర నీళ్లు తెస్తున్నా..

మా అంగన్‌వాడీ కేంద్రం పక్కన స్కూలు ఉంది. అక్కడి చేతి పంపు దగ్గరకు వెళ్లి బిందెతో నీళ్లు తెస్తున్నా. ఈ చేతి పంపు నీళ్లు చిలుము వాసన వస్తున్నాయి. కానీ.. ఆ నీటినే వినియోగించుకుంటున్నాం. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. పైపు కూడా వెయ్యలేదు. ఎండాకాలం చాలా ఇబ్బందిగా ఉంటది. పిల్లలకు ఎక్కువ నీటి వాడకం ఉంటది.
–బానోత్ మారు, అంగన్‌వాడీ ఆయా, బద్దుతండా

చాలా చోట్ల తాగునీరు ఉంది..

అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సమస్య లేదు. ఎక్కడైనా ఉంటే పక్కనే ఉన్న పంపుల ద్వారా నీళ్లు తెచ్చుకుంటున్నారు. భగీరథ కనెక్షన్లు కూడా ఇచ్చారు. కొన్ని సెంటర్లకు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఇటీవల మిషన్ భగీరథ అధికారులకు తెలియజేశాం. అన్ని కేంద్రాలకూ నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం. మార్చి కల్లా సమస్య పరిష్కారమవుతుంది.
–స్వర్ణలత లెనీనా, డీడబ్ల్యూవో, భద్రాద్రి

భద్రాద్రి జిల్లాలోని ప్రతి ఇంటికీ శుద్ధజలాలు అందించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగార్చింది. కనీసం పైపులైన్ల ఆనవాళ్లు కూడా లేకుండా చేసింది. దీంతో చివరికి అంగన్‌వాడీ కేంద్రాల్లోని పసి పిల్లలకు కూడా చేతి పంపుల నీళ్లే దిక్కవుతున్నాయి. ఆ నీళ్లన్నీ చిలుముతో కూడి ఉండడంతో వాటిని ఆ చిన్నారులు తాగలేకపోతున్నారు. దీంతో చాలామంది పిల్లలు తమ ఇళ్ల నుంచే నీళ్ల బాటిళ్లు తెచ్చుకుంటున్నారు. ఇంకా పలు అంగన్‌వాడీ కేంద్రాలకు నీటి సౌకర్యం కూడా లేదు. మరికొన్ని చోట్ల ఏకంగా అంగన్‌వాడీ టీచర్లే స్థానిక వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్నారు. ఇంకా కొన్ని చోట్ల గ్రామంలో ఉన్న చేతి పంపుల నుంచి నీళ్లు మోసుకొని తెస్తున్నారు. అయితే, చేతి పంపుల్లో చిలుముతో వస్తున్న నీళ్లను తాగడం వల్ల అభం శుభం తెలియని కొందరు చిన్నారులు అక్కడక్కడా అనారోగ్యం పాలవుతున్నారు. అయితే, జిల్లాలోని 382 అంగన్‌వాడీ కేంద్రాలకు శుద్ధజలాలు అందించే మిషన్ భగీరథ నీళ్లే సరఫరా కావడం లేదంటూ గత నెలలో ఐసీడీఎస్ శాఖ సర్వేలో వెల్లడి కావడం గమనార్హం. –భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ)

పసి పిల్లలకు పంపునీళ్లా?

చాతకొండ అంగన్‌వాడీ కేంద్రానికి బిందెతో నీళ్లు మోసుకొస్తున్న అంగన్‌వాడీ టీచర్, పంచాయతీ నర్సరీ మోటరు వద్ద నీళ్లు పడుతున్న అంగన్‌వాడీ టీచర్, బద్దుతండాలో చేతి పంపు వద్ద బోరు కొడుతున్న అంగన్‌వాడీ ఆయా

- చిలుము పట్టిన చేతిపంపుల నీటినే తాగుతున్న చిన్నారులు
- కొన్ని చోట్ల ఇళ్ల నుంచి నీళ్ల బాటిళ్లు తెచ్చుకుంటున్న బాలలు
- 'భద్రాద్రి'లో 382 అంగన్‌వాడీలకు అందని భగీరథ నీళ్లు
- పారుగునున్న నర్సరీ మోటర్ల నుంచి మోసుకొస్తున్న టీచర్లు
- కొన్ని చోట్ల స్కూళ్ల చేతి పంపుల నుంచి తెస్తున్న ఆయాలు
- మిషన్ భగీరథను 'నీరు'గార్చిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం

అంగన్‌వాడీ కేంద్రాల్లో శుద్ధజలాలు లేకపోవడంతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇళ్ల నుంచే నీళ్ల బాటిళ్లను పంపిస్తున్నారు. బాటిళ్లు తెచ్చుకోలేని పిల్లలైతే ఆ చిలుముతో కూడిన నీటినే తాగుతున్నారు. భద్రాద్రి జిల్లాలో 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో 1,712 కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. అధికారుల గణాంకాల ప్రకారం వీటిల్లో 382 అంగన్‌వాడీ కేంద్రాలకు భగీరథ నీరు సరఫరా కావడం లేదు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు భగీరథ కనెక్షన్లు ఉన్నా.. ట్యాంకులు పనిచేయని కారణంగా సరఫరా ఉండడం లేదు. దీంతో పక్కనే ఉండే చేతిపంపుల మీద ఆధారపడాల్సి వస్తోంది. అయితే, కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు మూత్రశాలలకు వెళ్లలేకపోతున్నారు. అక్కడ నీటి సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. ఇక రానున్న వేసవిలో ఈ అంగన్‌వాడీల్లో తాగునీటి సమస్య వెంటాడే ప్రమాదం కన్పిస్తోంది.

382 అంగన్‌వాడీలకు 'భగీరథ' నీళ్లు లేవంటున్న గణాంకాలు

ప్రతి గ్రామానికీ భగీరథ నీళ్లు సరఫరా అవుతున్నట్లు అధికారులు లెక్కలు చూపిస్తున్నారు. కానీ.. జిల్లాలోని 382 అంగన్‌వాడీ కేంద్రాలకే నీరు సరఫరా కావడం లేదంటే ఇంకా ఎన్ని గ్రామాలకు నీరు అందడం లేదో అనే విషయం అవగతమవుతోంది. దీంతో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేతిపంపుల వద్దకు వెళ్లి పంపుకొట్టుకుని మరీ నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోంది. చాతకొండ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ ఉన్నారు. ఆయా లేదు. దీంతో ఆ టీచరే పక్కన ఉన్న పంచాయతీ నర్సరీ వద్దకు వెళ్లి బిందెతో నీళ్లు తెచ్చుకుంటోంది. టేకులపల్లి మండలం బద్దుతండాలో చేతిపంపు నుంచి తెచ్చిన చిలుముతో కూడిన నీటినే పిల్లలు తాగుతున్నారు. సిబ్బంది కూడా అదే నీటితో వంటలు వండుతున్నారు.

8న జాతీయ లోక్ అదాలత్

భద్రాచలం పర్యటనలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్జి భానుమతి

భద్రాచలం, ఫిబ్రవరి 20: మార్చి 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు భద్రాద్రి జిల్లా జడ్జి భానుమతి తెలిపారు. భద్రాచలం పట్టణంలో గురువారం పర్యటించిన జిల్లా జడ్జి తొలుత కారా సెంటర్ శిశు గృహ చిల్డ్రన్స్ హోంను సందర్శించారు. అక్కడి పిల్లలకు అందుతున్న సదుపాయాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వారి ఆలనా పాలనపై ఆరా తీశారు. అనంతరం సబ్ జైలును సందర్శించి ముద్దాయిలకు ఫ్రీ లీగల్ ఎయిడ్ న్యాయ సహాయంపై వివరించారు. జైలుశిక్ష పూర్తయి బయటకు వచ్చిన తర్వాత ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. అనంతరం మానవసేవ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సరోజిని వృద్ధాశ్రమాన్ని సందర్శించిన జడ్జి.. అక్కడి వృద్ధులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం భద్రాచలం కోర్టు పరిధిలో ఉన్న పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగిన కేసులు ఎక్కువ ఉండేలా చూడాలన్నారు. భద్రాచలం జడ్జి శివనాయక్, న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కోర్టులో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి

అటవీ భూములకు హద్దులు పెడతాం

తవిసిబోడు గ్రామసభలో జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్

కారేపల్లి, ఫిబ్రవరి 20: అటవీ శాఖ భూములు ఆక్రమణకు గురికాకుండా, పోడు భూముల వివాదాలు తలెత్తకుండా ఉండేందుకు సరిహద్దులు నిర్ణయిస్తామని జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ అన్నారు. మండలంలోని తవిసిబోడులో గురువారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రైతులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామన్నారు. కందకాలు తవ్వి అటవీ, ఆర్వోఎఫ్ఆర్ భూములకు స్పష్టంగా సరిహద్దులు ఏర్పాటు చేస్తామని, వన్యప్రాణులను అడవులకే పరిమితం చేసేందుకు పండ్ల మొక్కలు విరివిగా నాటుతామన్నారు. అటవీ మైదాన ప్రాంతంలో మంకీకోర్ట్ ప్లాంటేషన్ చేస్తామని, రైతులకు సౌరశక్తితో నడిచే బోర్‌వెల్‌ను అందించడానికి ఐటీడీఏ మద్దతు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ గ్రామసభలో ఎఫ్‌డీవో మంజుల, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గ్రామసభలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో